క్లుప్తంగా

రహదారులు పచ్చటి తోరణాలుగా నిలవాలి

నేలకొండపల్లి: రహదారులు పచ్చటి తోరణాలుగా నిలవాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్ సూచించారు. కోదాడ–కురవి జాతీయ రహదారిలోని నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో నిర్మించనున్న టోల్‌ప్లాజా వద్ద బుధవారం మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ జాతీయ రహదారి వెంట మొక్కలు విరివిరిగా నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదానీ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, టీమ్ లీడర్ రామిరెడ్డి, పవర్‌మెక్ పీడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో భాగంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ డ్రాయింగ్ ఒలింపియాడ్‌లో నగరంలోని సెంచరీ హై ప్రొఫైల్ స్కూల్ విద్యార్థి మొగిలి హర్షిత్ ప్రతిభ చాటారు. ఈమేరకు హర్షిత్ రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడని స్కూల్ బాధ్యులు ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థిని ప్రభాకర్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సంచార వైద్యశాలను ప్రారంభించిన మేయర్


జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: ప్రభుత్వ ఆస్పత్రి సహకారంతో సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సంచార వైద్య సేవలను మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం నగరంలోని గాంధీపార్క్‌లో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో వైద్య సేవలందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ వి.చంద్రమోహన్, ఆర్.రవీందర్‌రావు, కొత్త సత్యనారాయణరెడ్డి, డాక్టర్ హరినాథబాబు, టి.జనార్దన్,గోవర్దన్, నరసయ్య, బి.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి విద్యానగర్‌కాలనీకి చెందిన జవ్వాది రాములు, నాగలక్ష్మి దంపతులు రూ.10,116లను విరాళంగా అందించారు. బుధవారం దేవాలయ కమిటీ సభ్యులకు అందించినట్లు కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కరరావు తెలిపారు.

దరఖాస్తు గడువు పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల దరఖాస్తు గడువు పెంచాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలు సకాలంలో అందలేదని, సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'రాయల' పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని బీసురాజుపల్లితండాలో ఇటీవల మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు నూనావత్ భద్రుకి టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు బుధవారం భద్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నం రాజశేఖర్, మోహన్, వీరన్న, శ్రీను, సురేష్, నరేష్, సాయి, బోడ చందు, నాగేశ్వరరావు, నాన్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రంగబలి
వినోద	మిషన్ ఇంపాసిబుల్ (ఇంగ్లిష్)
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మిషన్ ఇంపాసిబుల్(తెలుగు)
శ్రీనివాస	భాగ్ సాలే
సుందర్	గ్యాంగ్ లీడర్, సర్కిల్

\- ఖమ్మంగాంధీచౌక్

రైతన్నా.. జరభద్రం!

- ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్‌తో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి


నేలకొండపల్లిలో వ్యవసాయ బావి వద్ద స్టార్టర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు(ఫైల్)

నేలకొండపల్లి: వానాకాలంలో రైతులకు విద్యుత్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉండడంతో బోరు బావులు, వాగులు, కాల్వ వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారు. విద్యుత్ వినియోగంలో చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలుపోయే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. గతంలో పాలేరు నియోజకవర్గంలో ఇలా ప్రమాదాలకు గురై రైతులు, పశువులు మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి.

పరిహారం అందే సందర్భాలు..

- అకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు, పశువులు మృతి చెందినప్పుడు.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు తగిలి చనిపోతే.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ మోటార్లు, నేలపై కాకుండా గద్దెలపై ఏర్పాటు చేసి స్టార్టర్ బోర్డులు తడవకుండా చూడాలి.
- మోటార్లు పాడైతే మెకానిక్‌తో మరమ్మతులు చేయించాలే తప్ప సొంతంగా ప్రయత్నించవద్దు.
- మోటార్లకు వాడే సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. ఒకవేళ వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి.
- సబ్‌మెర్సిబుల్ మోటార్లతో పాటు విద్యుత్ వైరు ఉంటుంది. ఏ కొంచెం వైరు తెగినా పైన ఉన్న పరికరాలకు సరఫరా జరిగే అవకాశం ఉంటుంది. గమనించాలి.

పరిహారం ఇలా..

విద్యుత్ సంస్థ మూడు రకాల ప్రమాదాలకు నష్టపరిహారం అందిస్తోంది. మనుషులు, పశువులు మరణిస్తేనే పరిహారం అందిస్తారు కానీ గాయాలకు కాదు. మనుషులకు రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేల వరకు, మేకలు, గొర్రెలు, రూ.7 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ప్రమాదంలో మనిషి మరణిస్తే ఘటనా స్థలంలో ఫొటోలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకు అయితే ఫొటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి..



సీజనల్‌లో ప్రమాదాలు బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి. తీగలు తెగిపడినా, కిందకు వేలాడుతూ ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటాయి. సిబ్బందికి వెంటనే సమాచారం అందిస్తే మరమ్మతులు చేస్తారు.

\- కె.రామారావు, ఏఈ, టీఎస్ఎన్‌పీడీసీఎల్, నేలకొండపల్లి

అవగాహన కల్పించాలి..



విద్యుత్ ప్రమాదాల గురించి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. రైతులకు నష్టం జరగకుండా ముందుగా చర్యలను వివరించాలి. గ్రామాల వారిగా సదస్సులు నిర్వహించాలి.

\- తీగ రమణయ్య, రైతు, రాయగూడెం

ఖమ్మం స్వరూపాన్నే మార్చేశాం..

పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రభుత్వ సహకారంతోనే ఖమ్మం నగరంలో మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి మెట్రో నగరాలకు దీటుగా ఖమ్మాన్ని తీర్చిదిద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలో పలు డివిజన్లలో సుడా, ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన, నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు మంత్రి పువ్వాడ ప్రారంభోత్సవాలు, శంకుస్థానలు చేశారు. 50, 48, 42, 33వ డివిజన్‌లలో డివిజన్‌కు రూ.90 లక్షల చొప్పున కేటాయించి నిర్మించనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరానికి మరో రూ.300 కోట్ల పనులు ఉన్నాయని, ప్రస్తుతం ప్రతీ డివిజన్‌లో దాదాపు 3 కిలోమీటర్ల మేర సీసీ డ్రెయిన్లు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఎంఈ కృష్ణలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈలు నవ్య జ్యోతి, స్వరూపరాణి, ఏఎంసీ చైర్మన్ దొరెపల్లి శ్వేత, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ

కరపత్రాలు ఆవిష్కరణ..

నగరంలోని వీడీవోస్ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన లైసెన్స్ మేళాలో యువతకు ఎల్ఎల్ఆర్ అందజేసి, ప్రమాదాల నివారణపై రూపొందించిన కరపత్రాలను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమానికి మంచి ఆదరణ వస్తోందని, దాదాపు 10వేల మందికి సుమారు రూ.50లక్షలు పువ్వాడ ఫౌండేషన్ ద్వారా రవాణా శాఖకు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఎల్ఎల్ఆర్‌లకు అయ్యే ఖర్చు మీరే భరిస్తా అంటే అందుకు స్లాట్స్ ఇస్తామని చెప్పానని, ఇప్పటి వరకు 462 మందికి ఎల్ఎల్ఆర్ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఓ టి.కిషన్‌రావు, ఆర్టీఓ మెంబర్ రామారావు, ఎంవీఐ వరప్రసాద్, కార్పొరేటర్ పసుమర్తి రాంమోహన్, ఆర్‌జేసీ కృష్ణ, మురళి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు పలువురి నివాళి..


శ్రీధర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్: రెండు రోజుల క్రితం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మానుకొండ రాధాకిషోర్ కుమారుడు మానుకొండ శ్రీధర్ సంతాపసభను బుధవారం తన స్వగృహం బాలపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్ చిత్రపటంపై పలువురు పూలువేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, రేణుకా చౌదరి, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

కూసుమంచి: వరి నారు మడుల్లో తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయశాఖ కూసుమంచి డివిజన్ సహాయ సంచాలకుడు విజయచంద్ర సూచించారు. బుధవారం మండలంలోని నేలపట్ల గ్రామంలో పలు పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వరి నాడుమడుల్లో సస్యరక్షణ చర్యలను వివరిస్తూ నాటు వేసే వారం ముందు నారుమడిలో కిలో కార్బోఫ్యూరాన్ త్రీజీ గుళికలను చల్లుకోవాలన్నారు. పత్తిచేలను పరిశీలించి మొలక శాతాన్ని గమనించారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలను వివరించారు. ఏడీఏ వెంట ఏఈఓ వంశీ ఉన్నారు.

తల్లి పేరిట ట్రస్ట్, సేవా కార్యక్రమాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బ్యాంక్ కాలనీకి చెందిన 'ఆ నలుగురు'చిత్ర నిర్మాత పత్ర ప్రేమ్ కుమార్ తన తల్లి మాణిక్యం పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు బుధవారం ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. తాను సినిమాలు తీయడానికి తల్లి అందించిన ప్రోత్సాహం మరువలేనని పేర్కొన్నారు. ఆమె పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామినేని వెంకటయ్య, కొండబాల వెంకటేశ్వర్లు, సరిత, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

కూసుమంచి: చేగొమ్మ గ్రామానికి చెందిన యువతకు క్రీడా సామగ్రి బుధవారం లభించింది. సర్పంచ్ రెడ్డిమల్ల రమణమ్మ క్రికెట్ కిట్ అందజేయగా.. వాలీబాల్ నెట్‌ను బొల్లికొండ శ్రీకాంత్ తమ సొంత ఖర్చులతో కొని బహూకరించారు. ఈమేరకు యువకులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

కాటికాపరుల సేవలు స్ఫూర్తిదాయకం


మరణ ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: కాటికాపరుల సేవలు స్ఫూర్తిదాయకమని 46 డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ అన్నారు. హిందూ శ్మశానవాటిక మహాప్రస్థానంలో 46 డివిజన్‌కు చెందిన వ్యక్తి అంత్యక్రియలకు వచ్చిన కార్పొరేటర్‌తో పాటు కుమ్మరి, కురుమ సంఘం నాయకులకు సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలు ఆధ్వర్యాన బుధవారం మరణ ధ్రువపత్రాలను అందజేశారు. కుమ్మరి సంఘం నాయకులు శనిగరం ఉప్పలయ్య, కొత్పల్లిరాజయ్య, ఊటుకూరి ఆంజనేయులు మల్లేశంతో పాటు దేవర వెంకన్న, కాటం యాదయ్య, పంది వేణు, తదితరులు పాల్గొన్నారు.

వీధులు ఊడ్చి..చెత్తను ఎత్తి..


చెత్తను ఎత్తుతున్న సర్పంచ్, వార్డు సభ్యులు

కూసుమంచి: గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకై సమ్మె చేపట్టగా.. గ్రామాల్లో వీధుల వెంట చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఈక్రమంలో మండల కేంద్రమైన కూసుమంచి గ్రామ సర్పంచ్ చెన్నామోహన్ తన వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శితో కలిసి బుధవారం వీధులను శుభ్రం చేశారు. చెత్తను ట్రాక్టర్‌లోకి ఎత్తగా సర్పంచ్ స్వయంగా ట్రాక్టర్ తోలుకుంటూ చెత్తను తరలించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న సమ్మెలో ఉన్న కార్మికులు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసమే తాము సమ్మె చేస్తున్నామని, తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీపీ వర్కర్లకు ఆర్థిక సాయం..

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపూడి గ్రామ సర్పంచ్ దేవ్‌సింగ్ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. సమ్మెకాలంలో కార్మికులు పోషణకు ఇబ్బంది పడకుండా తమ వంతుగా ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెపల్లి కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి, జేఏసీ నాయకులు పిట్టల మల్లయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది రాము, లింగయ్య, బాబురావు, బద్రు, రేణుక, విజయలక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పర్వం..

సుడా చైర్మన్‌కు..

ఖమ్మం సహకారనగర్: హౌసింగ్ సొసైటీలో గ్రీన్ బెల్ట్ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం సమర్పించగా.. పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు ఆర్‌వీఎస్ సాగర్, నందగిరి శ్రీను, జీఎస్ ప్రసాద్, నీరుకొండ చంద్రశేఖర్, చుంచు వీర నారాయణ, మజీద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాలులో బుధవారం ది న్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఇరిగేషన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు బాబా, నరేష్‌ల అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

తహసీల్దార్‌కు..

కూసుమంచి: మండల పరిధిలోని రాజుపేట గ్రామంలో హరితహారం పేరుతో దళితులకు చెందిన భూములను లాక్కొంటున్నారని, అట్టి భూములను కాపాడాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్రా ఉపేందర్ సాహూ తహసీల్దార్ శకుంతలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాజుపేట గ్రామంలో ప్రభుత్వ భూములు దొరల చేతుల్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ మంజుల, నాయకులు మట్టె నాగేశ్వరరావు, శ్రీకాంత్, కొమ్ము పూలే, మండల అధ్యక్షుడు సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓకు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ సమస్యలపై జేఏసీ ఆధ్వర్యాన బుధవారం డీఆర్‌ఓ శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో అక్రమరవాణా పెరిగిందని, రిటైర్డ్ అయిన వారికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కొత్త బస్సులు కొనడంలేదని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, రమేష్, వెంకటేశ్వర్లు, బాబు, శ్రీనివాసరావు, బసవయ్య, బుచ్చిబాబు, నరసింహరావు, తాయారుపాష, నవీన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం మండలాల్లో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను మూసి వేయించారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందలేదని తక్షణమే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్


తిరుమలాయపాలెం కేజీబీవీలో తరగతులను బహిష్కరించిన విద్యార్థినిలు

రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ ధర్నా

ఉచిత విద్యుత్ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ మూడు గంటలు ఇస్తే సరిపోతుందని ఎలా చెబుతారని, ఈ వ్యాఖ్యలను బట్టి రైతులపై కాంగ్రెస్ పార్టీకున్న వైఖరి ఏంటో స్పష్టమవుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల మేలు కోరుతోందని, వారికి అండగా నిలుస్తోందని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కాగా, పలుచోట్ల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్


కూసుమంచి: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే కందాల, పార్టీ శ్రేణులు


తిరుమలాయపాలెం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


ఖమ్మంరూరల్: నాయుడుపేట సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నేలకొండపల్లి: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉచిత విద్యుత్ తీసుకొచ్చిందే కాంగ్రెస్..

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కామేపల్లి (కారేపల్లి)/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/ఖమ్మం సహకారనగర్: 24గంటల ఉచిత విద్యుత్ పేరుతో ప్రైవేట్ సంస్థలకు కమీషన్ల కోసం కరెంట్‌ను అప్పనంగా దోచిపెడుతూ, డిస్కంలను రూ.60వేల కోట్ల అప్పుల ఊబిలో సీఎం కేసీఆర్ పడేశాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం కామేపల్లి మండలం కొత్తలింగాల విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే నేలకొండపల్లి మండలకేంద్రంలో రూ.లక్షల కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే తీర్చాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడుతాయని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేని సీఎం కేసీఆర్ దిగజారే చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతో పాటు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఉన్నం రాజశేఖర్, మోహన్, నాగరాజు, పోట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావీద్ మాట్లాడుతూ.. రైతాంగానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో అమలుకావడం లేదని ఆరోపించారు. అనంతరం కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజాహిద్ సయ్యద్ హుస్సేన్ మాట్లాడగా.. ప్రజాప్రతినిధులు, నాయకులు వెంకటేశ్వర్లు, సైదులు, పల్లెబోయిన భారతిచంద్రం, భూక్యా బాలాజీనాయక్, ఏలూరి రవికుమార్ పాల్గొన్నారు. కొత్తలింగాలలో జరిగిని కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజల నర్సింహరెడ్డి, నాయకులు గోపిరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, సర్పంచ్ రాంచందర్, భూక్యా శ్రీరాం, రామకృష్ణ, చల్లా మల్లయ్య, ముత్తి సాంబశివరావు, మోహన్, లాలు, బుచ్చయ్య, తదితరులు పాల్గొనగా.. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీటీసీ రేగూరి వాసవి, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, దోసపాటి శేఖర్, జెర్రిపోతుల సత్యనారాయణ, యడవల్లి నాగరాజు, సైదిరెడ్డి, జాన్‌రెడ్డి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జావీద్


నేలకొండపల్లి: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కామేపల్లి: కొత్తలింగాలలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు